మహిళా మార్ట్‌లు డీలా!

- రోజుకు రూ.40వేల నుంచి రూ.4వేల వరకూ తగ్గిన వ్యాపారం
- వెలవెలబోతున్న మార్టులు
- ఇబ్బందుల్లో డ్వాక్రా మహిళలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక తప్పని తిప్పలు



నల్లజర్ల మహిళా మార్ట్‌లో అందుబాటులో ఉన్న నిత్యావసర సరకులు



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న మహిళా మార్ట్

నల్లజర్ల: మహిళల ఆర్థిక స్వావలంబన, మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళామార్ట్‌లు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో రెండోదిగా నల్లజర్లలో ప్రారంభించిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ప్రస్తుతం వెలవెలబోతోంది. నష్టాల వైపు పయనిస్తోంది. ఈ మార్ట్ ఏర్పాటు సమయంలో 20,330 మంది సభ్యులతో 2023 సంఘాలతో రూ.50,80,500తో ప్రారంభించారు. సంఘ సభ్యుల నుంచి ఈ సొమ్ము సేకరించి పెట్టుబడిగా పెట్టారు. ఈ నిధులతో ఏర్పాటు చేసిన మార్ట్ కమిటీ పర్యవేక్షణలో నిర్వహణ చేసి వచ్చిన లాభాలు ఏడాదికోసారి సభ్యులకు పంచాల్సి ఉంది. ప్రారంభంలో మార్టుకు అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించారు. రోజు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు విక్రయాలు జరిగేవి. ఆరుగురు మహిళలకు ఉపాధి లభించింది. దీంతోపాటు మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారయ్యే ఉత్పత్తుల విక్రయాలు జరిగేవి. తద్వారా ప్రజలకు నాణ్యమైన సరకులు సరసమైన ధరలకు అందేలా చర్యలు తీసుకున్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్ట్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. ప్రైవేటు దుకాణాలలో వ్యాపారాలు తగ్గాయి. ఈ దశలో మార్ట్‌కు మంచి ఆదరణ రావడం టీడీపీ వర్గీయులకు మింగుడు పడడంలేదు. దీంతో మార్ట్‌ను నిర్వీర్యం చేసేందుకు మార్ట్‌ను మూసి వేసే దిశగా వెలుగు సిబ్బంది, మహిళా సంఘాలపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువస్తున్నట్టు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాముఖ్యత తగ్గించి మద్యం వ్యాపారానికి పెద్దపీట వేసింది. మార్ట్‌లో అమ్మకాలు పూర్తిగా తగ్గాయి. మహిళా సాధికారతను దెబ్బతీసేలా మహిళా మార్ట్‌లను పరోక్షంగా మూసేందుకు పక్కాగా స్కెచ్ వేసినట్టు మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇందుకు గాను ఆడిటింగ్‌లో మార్ట్‌లు నిర్వహణ నష్టాల్లో ఉన్నట్టు చూపించే ప్రక్రియ జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులు నెలకొనడంతో మార్ట్ నిర్వహణ గందరగోళంగా మారింది. సిబ్బంది ఆరు నుంచి రెండుకు తగ్గించారు. ఫలితంగా మార్ట్ నిర్వహణ వెలుగు సిబ్బందికి మహిళా సంఘాలకు చాలా ఇబ్బందికరంగా మారినట్టు చెబుతున్నారు.

ప్రభుత్వ బెదిరింపులతో..



మహిళా మార్ట్ ప్రారంభించాక సరకులు అందుబాటు ధరలకే లభిస్తున్నాయి. గత ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి మహిళా మార్ట్‌లను ప్రోత్సహించింది. అలాంటి మహిళా మార్ట్‌లను మూసి వేసే దిశగా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగి అధికారులను బెదిరిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. అధికారులు స్పందించి మార్ట్‌ల అభివృద్ధికి కృషి చేయాలి.

యజ్జవరపు లక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు

చర్యలు తీసుకుంటున్నాం



మార్ట్‌లో విక్రయాలు తగ్గిన మాట వాస్తవమే. విక్రయాలు పెరిగేలా నూతన సంవత్సర, సంక్రాంతి పండుగలకు ప్రత్యేక ఆఫర్లు పెడుతున్నాం. మహిళా సంఘాలతో పాటు స్థానికులు ఇక్కడ సరకులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మార్కెట్ ధర కంటే తక్కువ ధరలకే నిత్యావసర సరకులు అందజేసి మార్ట్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. అద్దె, నిర్వహణ ఖర్చులు పెరగడంతో సిబ్బందిని తగ్గించాం. మార్ట్‌ను లాభాల వైపు నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శ్యాంసుందర్, ఐకేపీ ఏపీఎం, నల్లజర్ల

క్లుప్తంగా

టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం



విరాళం డీడీని చైర్మన్ నాయుడుకు అందజేస్తున్న దాత రవికుమార్ దంపతులు

ఉండ్రాజవరం(నిడదవోలు రూరల్): శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్‌కు శశి విద్యాసంస్థలు రూ.1,01,11,111 విరాళం అందించాయి. వేలివెన్ను శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్, లక్ష్మీసుప్రియ దంపతులు విరాళం డీడీని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు గురువారం అందజేశారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు విరాళం అందజేసిన శశి విద్యాసంస్థల సేవలను పలువురు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు పరామర్శ



రావిమెట్లలో శ్రీనును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

నిడదవోలు రూరల్: నియోజకవర్గ పరిధిలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు గురువారం పరామర్శించారు. రావిమెట్ల గ్రామ వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు మిద్దే శ్రీను తల్లి సూరమ్మ మృతిచెందారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రీనివాసనాయుడు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, కాల్దారి శ్రీను, మారిశెట్టి రామసత్యనారాయణ, ఎ.శ్రీనివాస్, గాలింకి శ్రీను, పోల్నాటి సత్యనారాయణ, గండ్రోతు అరవలరాజులు పాల్గొన్నారు. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామ నాయకులు తొర్లపాటి జయంతిరావు తండ్రి దేవాంతకుడు, దుద్దుపూడి కాశీవిశ్వనాథం అమ్మమ్మ సుంకర ముత్యాలమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను శ్రీనివాస్‌నాయుడు పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ అధ్యక్షుడు బూరుగుపల్లి సుబ్బారావు, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నిడదవోలులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

నిడదవోలు రూరల్: పట్టణంలోని చర్చిపేటలోని మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జువ్వల రాంబాబు, బొచ్చా కృష్ణ, తూరుగోపు చిరంజీవి, కె.నాని, విద్యార్థులు పాల్గొన్నారు.

'జొన్నకూటి'కి తెలుగు తేజం అవార్డు



జొన్నకూటి ప్రమోద్‌కుమార్‌కు పురస్కారం అందిస్తున్న ప్రముఖులు

తాళ్లపూడి: శ్రీశ్రీ కళావేదిక నిరంతర సాహితీ, సాంస్కృతిక క్రతువులో భాగంగా తెలుగు భాషా, సాహిత్యం, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తున్న కవులకు అవార్డులు ప్రదానం చేశారు. శ్రీశ్రీ కళావేదిక, భువన చంద్ర టౌన్ హాల్ నరసరావుపేట పల్నాడు జిల్లాలో వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని నలు మూలాల నుంచి తెలుగు కవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పైడిమెట్ట గ్రామానికి చెందిన కవి, రచయిత, వ్యాసకర్త, ప్రచురణ కర్త, ఉపాధ్యాయులు, జర్నలిస్ట్ డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్‌కు తెలుగు తేజం పురస్కారంతో సత్కరించారు. స్థానిక ఎమ్మెల్యే చెదలవాడ అరవింద్‌బాబు, రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మెన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు, శ్రీశ్రీ కళావేదికా అంతర్జాతీయ చైర్మెన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ఆయనకు తెలుగు తేజం పురస్కారం ప్రదానం చేశారు. ఆయన గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

కూటమి పాలనలో అన్నీ మోసాలు, అరాచకాలే..

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ఊనగట్ల గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ గ్రామసభ



ఊనగట్లలో చంద్రబాబు అరాచకాలు, మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు

చాగల్లు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే రూ.1.37 లక్షల కోట్లు అప్పులు చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఊనగట్ల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎస్సీ ఏరియాలో జరిగిన సభలో చంద్రబాబు 15 నెలల పాలనలో అరాచకాలు, మోసాలను వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ చంద్రబాబు తల్లికి వందనం పేరుతో ప్రజలను వంచన చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే ఈ పథకం ఇచ్చారన్నారు. అదే విధంగా మహిళలు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో వారిని దగా చేశారని అన్నారు. రాష్ట్రంలో వైద్యం, వ్యవసాయ రంగాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని, రైతన్నలకు పెట్టుబడి సాయం అందించకుండా అప్పులపాలు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దాదాపు ఏడు లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఎగ్గొటారని ఆరోపించారు. చదువుకునే పిల్లలను, నిరుద్యోగులను మోసగించి వంచించిందన్నారు. 2.60 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేసిందని, ఇంటి వద్దకే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో 9,280 మంది ఆపరేటర్లు వీధుల పాలయ్యారని తలారి వెంకట్రావు అన్నారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి పరిమిసోమరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, చాగల్లు మండల పార్టీ అధ్యక్షులు మట్టా వెంకట్రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉప్పులూరి సూరిబాబు, సర్పంచులు ముప్పిడి మహాలక్ష్ముడు, కుడప రాంబాబు, ఊనగట్ల గ్రామ నాయకులు కంకటాల శ్రీను,వి. కిషోర్, కె.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవసరానికి మించితే పంటలకు నష్టం

- రైతులతో కలెక్టర్ ప్రశాంతి
- అన్నదేవరపేట, రాగోలపల్లి ప్యాక్ సొసైటీల పరిశీలన



రాగోలపల్లి సొసైటీ వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

తాళ్లపూడి: యూరియా అవసరం మేర ఉందని రైతులు అవసరానికి మించి వినియోగిస్తే పంటకు నష్టం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. తాళ్లపూడి మండలంలోని రాగోలపల్లి, అన్నదేవరపేట సొసైటీలలో ఎరువుల వినియోగం, సరఫరా పరిస్థితిని కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఎరువుల నిల్వలపై ఆమె ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసారం, పంట విస్తీర్ణం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని దశల వారీగా ఎరువులను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. అన్నదేవరపేట ప్యాక్ సొసైటీలో ఈ సీజన్‌లో 65 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగించారని, ఇది గత సీజన్ కంటే ఎక్కువ అని కలెక్టర్ వివరించారు. రాగోలపల్లి ప్యాక్ సొసైటీలో మాత్రం గత సీజన్, ప్రస్తుత సీజన్ వినియోగం దాదాపు ఒకే స్థాయిలో ఉండి సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం పంటలకు సరిపడేలా ఎరువులు కేటాయించి సమయానికి సరఫరా చేస్తోందని, యూరియా సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బంది లేదని రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. పంట సాగుకు అనుగుణంగా దశల వారీగా ఎరువులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, తహసీల్దార్ లక్ష్మిలావణ్య, ఏవో జి.రుచిత, ఇతర అధికారులు, సిబ్బంది, ప్యాక్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

జిల్లా నోడల్ అధికారి వెంకటరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అక్షరాంధ్ర నోడల్ అధికారి వెంకటరెడ్డి

పెరవలి: నిరక్షరాసులను అక్షరాసులుగా తీర్చిదిద్దటమే కాకుండా డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించాలని జిల్లా నోడల్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు, అధికారులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సీహెచ్ వెంకటరమణ, ఎంఈఓ సూర్జహాన్,ఉపాధ్యాయులు, వలంటీరీలు, అధికారులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం(నిడదవోలు రూరల్): మహిళలను సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం మండలపరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట రామారావు, ఏపీఓ జి.కాంతారావు, రిసోర్స్‌పర్సన్ ఎల్ఎస్‌వీబీఆర్‌ఎల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చి వారి జీవన విధానంలో మార్పు తీసుకురావాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అక్షరాంధ్ర(ఉల్లాస్)పై వలంటీర్ల టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు, దుద్దుకూరు జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు, ఉపాధి హామీ పథకం ఏపీఓ జీవీ శ్రీనివాసరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో గురువారం ఉల్లాస్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ మహాలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో 29వ స్థానంలో ఉందన్నారు. రాబోయే మూడేళ్లలో డ్వాక్రా సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇంతవరకు 2500 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వీరి కోసం 250 మంది వలంటీర్లను నియమించామన్నారు. ఏపీఎం శ్యామ్‌సుందర్, ఎంఈఓ–1 సత్యనారాయణ, ఎంఈఓ–2 భగవతీదేవి, సీసీలు మాలినీ, రాధామురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.కాశీ మధుబాబు డిమాండ్ చేశారు. నిడదవోలులో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రభుత్వం భర్తీ చేసే ఉద్యోగాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జీతాలు నేరుగా చెల్లించడంతో పాటు దళారి వ్యవస్థను తొలగించాలన్నారు. ఈనెల 9వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సదస్సు కార్యాచరణపై చర్చిస్తామన్నారు. డివిజన్ కమిటీ నాయకుఉల కె.రవి, ఎం.వసంతరాయులు, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, అంబేద్కర్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

గణపయ్యకు 111 కేజీల లడ్డూ



నిడదవోలు పూజాగణపతి, కుమారస్వామికి 111 కేజీల లడ్డూను అందజేస్తున్న గాయత్రి స్వీట్స్ నిర్వాహకులు

నిడదవోలు: పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్లో ఉన్న పూజా గణపతి, కుమారస్వామి ఆలయం వద్ద తొమ్మిదవ రోజు గురువారం 103 వార్షికోత్సవ గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. హైదరాబాదు నుంచి తీసుకువచ్చిన సుమారు 18 అడుగుల వినాయక భారీ విగ్రహం వద్ద భక్తులు విశేష ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన కాకినాడ వారిచే రాగా ఆలాపన మ్యూజికల్ నైట్ కార్యక్రమం అలరించింది. పట్టణంలోని మార్వాడీలు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన గాయత్రి స్వీట్స్ ప్రొఫెటర్ ఎస్.గిరి స్వామివారికి 111 కేజీల భారీ లడ్డును అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబా మాట్లాడుతూ భక్తులు సమర్పించిన స్వామివారి లడ్డూలను ఈనెల ఆరో తేదీన నిర్వహించే భారీ వినాయక ఊరేగింపులో భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు సరిదే సత్యం, లక్కంసాని సూర్యరావు, ముప్పన బోయిన గంగారావు, తోలేటి కోటేశ్వర రావు, దుల్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన బాధితులు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న చిట్టీల బాధితులు

తాళ్లపూడి: తిరుగుడుమెట్టలో ఇటీవల చిట్టిల డబ్బుతో వ్యక్తి పరారైన సంఘటనకు సంబంధించి మోసపోయిన బాధితులందరూ తాళ్లపూడి పోలీస్‌లను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన నాయకులు అల్లూరి రాంబాబు, అన్నమరెడ్డి శేఖర్, రమణ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో బాధిత మహిళలు, ప్రజలు తమకు న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ విజయబాబుకు బాధితులు తమ గోడు వివరించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కష్టపడి సంపాదించిన సొమ్మును పోగొట్టుకున్నామని, తాము మోసపోయామని అన్నారు. ఓసీబీసీ ఎస్సీలకు చెందిన సుమారు రూ.5 కోట్లకు పైగా ప్రజలకు డబ్బులను ఇవ్వకుండా నిందితుడు హైదరాబాద్ వెళ్లిపోయాడన్న సమాచారం పోలీస్‌లకు తెలిపారు. ఈ మేరకు పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని తెలిపారు.

కుట్ర పూరితంగా ఆరోపణలు

చాగల్లు: సోషల్ మీడియా వేదికగా గత కొద్ది రోజులుగా తనపై కుట్రపూరితంగా తప్పుడు ఆరోపణలతో ట్రోలింగ్ చేస్తున్నారని రంగస్థల నటుడు, సత్య హరిశ్చంద్ర పాత్రధారి డీవీ సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. చాగల్లు మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్ నివాసంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ వివరణ ఇచ్చారు. సంపత్ వరసిద్ధి వినాయక ఆలయ ప్రాంగణంలో ఈనెల ఒకటో తేదీన చాగల్లు వర్తక సంఘం వారి కళావేదికపై సత్య హరిశ్చంద్ర నాటకం ప్రదర్శన సమయంలో వచ్చిన ఆరోపణలను ఆయన ఖండిస్తూ వివరణ ఇచ్చారు. ఆయన తాత అయినటువంటి డీవీ సుబ్బారావు పేరుపెట్టుకున్న తను ఆయన నేర్పించిన క్రమశిక్షణ, నాటకరంగంలో ఆయన వద్ద నేర్చుకున్న బాణీలే ఆచరణీయం అన్నారు. సోషల్ మీడియాలో వికృతమైన పోస్టులు వద్దని హితవు పలికారు. ఉత్సవకమిటీ సభ్యులు గ్రంది రాంబాబు, జాన్ గంగారావు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా చాగల్లులో డీవీ సుబ్బారావు ప్రదర్శనలు ఇస్తున్నారని ఎప్పుడు ఆరోపణలు లేవని చెప్పారు.

ఆదర్శంగా తీర్చిదిద్దారు..



ఉపాధ్యాయుడు పెదప్రోలు శ్రీనివాస్ కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

పెరవలి: ప్రాథమిక పాఠశాల నుంచి ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దడంలో పెదప్రోలు శ్రీనివాస్ కుమార్ చేసిన కృషి అభినందనీయమని ఎంఈఓ షేక్ సూర్జహాన్ తెలిపారు. పెరవలి నెంబర్1 పాఠశాలలో గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. కేవలం ఇద్దరు టీచర్లతో ఉండే పాఠశాలను నేడు ఐదుగురు టీచర్లు ఉండే స్థాయికి తీసుకువచ్చారన్నారు. అనంతరం శ్రీనివాస్ కుమార్‌తోపాటు ఈయనకు సహకరించిన గుర్లపాటి రేణుకాదేవిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తి, రాజేష్, రాధిక, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామకృష్ణ లయన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే రాణించగలిగా..

చాగల్లు: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం బుల్లితెర గాయని శ్రీలలిత చాగల్లు విచ్చేశారు. తెలగా సంఘం వారి వినాయక ఆలయ ప్రాంగణంలో గురువారం జరిగిన రోషన్ లాల్ ఆర్కెస్ట్రాలో ఆమె పాల్గొని పాటలు పాడారు. అనంతరం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్ నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జీ తెలుగు సరిగమపదనిసలు కార్యక్రమం ద్వారా తొలిసారి బుల్లితెరలో ప్రేక్షకులకు పరిచయమయ్యానని, తర్వాత పాడుతా తీయగా, బోల్ బేబీ బోల్, సహా బుల్లితెర పాటల పోటీల కార్యక్రమాల్లో పాల్గొని అనేక పతకాలు గెలుచుకున్నట్లు చెప్పారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు కీరవాణి సంగీత బృందంలో తను ఒక సభ్యురాలుగా కొనసాగుతున్నట్లు చెప్పారు.